*Issued on 27-10-60*

**Volume : II**
**No. I**

**20th February, 1960**
**(Saturday)**

**Ist Phalguna**
**1881 S.E.**

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

# OFFICIAL REPORT

**Part II —Proceedings other than Questions and Answers.**

## *CONTENTS*

| | Pages |
|---|---|
| Presentation of the Budget for the year 1960-61 | [1-126] |

# The
# Andhra Pradesh Legislative Assembly Debates

*(Part II—Proceedings other than Questions and Answers)*

## OFFICIAL REPORT

---

**Thirty-eight day of the Ninth Session of the Andhra Pradesh Legislative Assembly.**

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

*Saturday, the 20th February, 1960.*

The House met at Four of the Clock.

*[Mr. Speaker in the Chair]*

[NO QUESTIONS: PART I- NOT PUBLISHED]

### *Presentation of the Budget for the year, 1960-61*

మిస్టర్ స్పీకర్ :—ఆర్థిక శాఖామంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారు, యిప్పుడు 1960-61 సంవత్సరపు సాలీనా ఆదాయవ్యయ పట్టికను (బడ్జెటు) ప్రవేశపెడతారు.

ఆర్థికమంత్రి (శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ):- అధ్యక్షా, ఈ సంవత్సరపు ఆర్థిక ప్రతిపాదనను అంటే, 1960-61 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్టును సమర్పిస్తున్నాను.

ముందుగా, మనపూర్వ ముఖ్యమంత్రి, డా. సంజీవరెడ్డికి ప్రశంసా పూర్వకమైన మన అభినందనలను ప్రకటిస్తున్నాను. రాష్ట్రపు చిక్కు వ్యవహారాలను ఆయన ఎంతో సామర్థ్యంతో, ఘంటాపథంతో సర్దుబాటు చేశారు. అలాగే మన యువక ముఖ్యమంత్రి, సరసుడు అయినట్టి శ్రీ సంజీవయ్యను కూడా అభినందిస్తున్నాను. వీరి నాయకత్వం క్రింద రాష్ట్రం అన్ని విషయాల్లోనూ ఇంకా ఎక్కువగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను. గౌరవనీయులైన మన సభాపతికి, రాష్ట్రపతి "పద్మభూషణ్" బిరుదును ప్రదానం చేశారు. (హర్షం) ఇది ఎంతో ఆనందదాయకమైన విషయం. ఈ గౌరవానికి వారు పూర్తిగా అర్హులు.

నా బడ్జెట్ ప్రతిపాదనలను గురించి ప్రస్తావించేముందు, ఒక చిన్న మనవి. [illegible] సంవత్సరంలో రాష్ట్రపు ఆర్థిక ద్రవ్య [illegible] సమీక్షిస్తున్నాను.

## 1959 లోని ఆర్థికస్థితుల పరామర్శ

1959 లో దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితి వ్యాప్తిలో వున్నది. 1958–59లో పంటలు మామూలుకన్న బాగానే పండినమాట నిజమే. పెరుగుతున్న ధరలపై దీని ప్రభావం కొంత సోకినమాట నిజమే. అయినప్పటికీ ధరల విసురును వెనక్కు మళ్ళించటం మాత్రం పూర్తిగా సాధ్యం కాలేకపోయింది. మరి ప్రస్తుత సంవత్సరపు పంటలను గురించిన అంచనాల ప్రకారం కూడా తక్షణ ప్రయోజనం గురించి ఏమంత ఆశ కన్పించటంలేదు. అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుతూనే వున్నది. అయితే ఏం, పనిలేనివారికి పనిపాటలు కల్పించటంలో మాత్రం చెప్పుకోతగ్గ అభివృద్ధి ఏమంత కన్పించలేదు. కాని అతిముఖ్యమైన విషయం ఏమంటే, ప్రణాళికా పథకాలు మాత్రం చురుగ్గా అమలు జరుగుతున్నాయి.

1958 సంవత్సరంలో వరదలు, అతివృష్టి, అనావృష్టి, అంటు తెగుళ్ళు స్వైర విహారం చేసి, పైర్లకు తీవ్రనష్టం కల్గించాయి. అందుమూలంగా అవసర వస్తువుల ధరలు పెరిగాయి. కాని 1959 సంవత్సరంలో మన ఆంధ్రప్రదేశ్‌లోనేకాక, దేశం మొత్తంమీద కూడ పంటలు బాగా పండినాయి. ప్రథమ పంచవర్షప్రణాళిక ఆరంభమైనాక, ఆహారధాన్యాలు ఇంత అధికంగా పండటం ఇదే మొదటిసారి. ఇందుకు దేశంలోని వాతావరణం అనుకూలంగా ఉండటం ఒక్కటే కాదు కారణం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు జరిపిన కార్యక్రమాలు, వ్యవసాయదారులు అవలంబించిన మెరుగైన సేద్యవిధానాలుకూడ అభివృద్ధికి చాలా ఉపయోగపడినాయి.

ఆహార పరిస్థితి :— అయితే ఈ అభివృద్ధి చెప్పుకోతగ్గదే అయినప్పటికీ 1958–59 లో దేశంలోని మొత్తం ఆహార పరిస్థితిపై దాని ప్రభావం [illegible] ఎక్కువగా పడలేదు. కాబట్టే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ధాన్యాన్ని [illegible] చేయటానికి, ధరలను అదుపులో పెట్టటానికి తగుకృషిని చేస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రానికి విడిగా ఒక ఆహారమండలాన్ని ఏర్పాటుచేయటం మంచిదని ఎంతగానో కేంద్రప్రభుత్వానికి నచ్చచెప్పాము. అయినప్పటికీ కేంద్రప్రభుత్వం దక్షిణాది ఆహార మండలపు ఏర్పాటునే కొనసాగించటానికి నిశ్చయించింది. రాష్ట్రంలో ధాన్యపు వర్తకము నిల్వచేసి, అధికం [illegible], రాష్ట్రప్రభుత్వం తన "పరిమిత సేకరణ" విధానాన్ని నిర్వహించింది.

ఈ సందర్భంలో ఒకమాట చెప్పవలసి ఉన్నది. ఇటీవల హైదరాబాదుకు [illegible] వచ్చినప్పుడు, ఆయన మనకొక మాట యిచ్చారు. మన

తరుగు ప్రాంతాలను పోషించటానికి, ధరలు వెర్రితలలు వేయకుండా నివారించటానికి అవసరమైన సరకును, అంటే ఒకటి రెండు లక్షల టన్నుల బియ్యాన్ని ఈ ఏడాదిలో ఆయన మన రాష్ట్రానికి సప్లయి చేస్తామన్నారు. ఎరువుల విషయంలో మనకున్న ప్రత్యేక అవసరాలనుకూడా ఆయన గుర్తించారు. అందుకు తగిన సప్లయిలను ఏర్పాటు చేయటానికి ఒప్పుకున్నారు. ఇలా అవసరమైనంతగా ఎరువులు లభిస్తే, మనరాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి ఇంకా అధికం కాగలదని ఆశించవచ్చును. దక్షిణ రాష్ట్రాలలో గోధుమ, గోధుమ సరకులను స్వేచ్ఛగా రవాణా చేసేందుకు వీలుగా, 1957 అంతర్మండలపు గోధుమ రవాణా కంట్రోలు ఆర్డరును 1959 మే నెలలో కేంద్రప్రభుత్వం సవరించింది.

ధరలు — 1959 ప్రారంభంలో చాల వస్తువుల టోకు ధరలు తగ్గుముఖం చూపినాయి కాని మళ్ళీ 1959 మే నెలనుంచి ఆకాశంకేసి చూడటం ఆరంభమైంది. ఇంకా ఆ ధోరణి సాగుతూనే వున్నది. కొన్ని ఆహారేతర వస్తువుల ధరలు, ముఖ్యంగా నూనెవిత్తుల, ప్రత్తిసరకుల ధరలు కొంతవరకు శాంతించినాయి. అయితే 1959 ఆరంభంలో సళ్ళిచ్చిన వాడకపు వస్తువుల ధరలు, ఆ తర్వాత, రాష్ట్రంలో చాలా కేంద్రాల్లో మళ్ళీ ప్రకోపించినాయి. ఆహార వస్తువుల ధరలు పెరగటమే ఇందుకు ముఖ్యకారణం.

పరిశ్రమలు :— క్రితం సంవత్సరంలోకన్న 1959లో రాష్ట్రంలోని పరిశ్రమలు అధికంగా ఉత్పత్తి చేశాయి. ప్రత్తి, నూలు, మద్యం, ఎరువులు, గాజు, సిమెంటు, బొగ్గు, కాగితం, సిగరెట్లు—వీటి విషయంలో నెలసరి సగటు ఉత్పత్తి పెరిగింది. కాని ప్రత్తిసరకులు, జనపనార, ఆస్బెస్టాస్, పంచదార 1958లో కన్న తక్కువ ఉత్పత్తి అయినాయి.

కార్మికులు :— 1958లో కన్న 1959లో కార్మికుల అలజడి అధికంగా వుంది. పనివారల సంఖ్యను తగ్గించటం, అధిక వేతనాలు, కరువుభత్యం—వీటినిగురించే వివాదాలు ఎక్కువగా జరిగినాయి. కనీస వేతనాల చట్టం వర్తించే వివిధ తరగతుల కార్మికుల వేతన ప్రమాణాలను సవరించి, మళ్ళీ నిర్ణయం చేయాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుమూలంగా ఇకముందు, యజమాని-కార్మికులమధ్య బాంధవ్యాలు చక్కబడగలవని ఆశించుదాం.

ఉద్యోగ వసతులు :— ఎన్నో ప్రణాళికా పథకాలు అమలు జరుగుతున్నప్పటికీ, దేశం మొత్తంమీద లాగానే రాష్ట్రంలోకూడా నిరుద్యోగ విషయం ఇంకా తీవ్రసమస్యగానే వుంటూ వచ్చింది. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు ఉద్యోగ అవ

కాశాలను అధికం చేయాలని ఎంతగానో పాటుపడుతున్నాయి. అయితే ఒక్క విషయం—త్వరత్వరగా పరిశ్రమలను నెలకొల్పితేనే తప్ప, అవి మధ్యరకంవి గానీ, చిన్నరకంవి గానీ, పరిస్థితి కుదుటపడదు.

## ప్రభుత్వ ఆర్థిక స్థితి

మన కొత్తరాష్ట్రం ఏర్పడిన నాల్గవ సంవత్సరం ఇది అంతేకాదు. రెండవ ప్రణాళికకుకూడ నాల్గవ సంవత్సరం. అప్పుడే మూడవ ప్రణాళిక సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. 1956 నుంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సుస్థిరంచేసే ప్రయత్నంలో జరిగిన అభివృద్ధిని గురించి ఈ తరుణంలో కొద్దిగా ప్రస్తావించటం అప్రస్తుతం కాదనుకుంటాను.

1956లో కొత్తరాష్ట్రం రూ 1.59 కోట్ల రొక్కపు నిల్వతో ప్రారంభమైంది. 1956-57 సంవత్సరానికి రివిన్యూ జమలు రూ. 47.25 కోట్లు అని, రివిన్యూ ఖర్చు రూ. 51.94 కోట్లు అని అనుకోవటం జరిగింది. ఆ ఏడాది పెట్టుబడి ఖర్చు రూ. 24.16 కోట్లు అని అంచనా వేయబడింది. ఇది ఇలావుండగా ప్రభుత్వ ఋణ బాధ్యతకు తోడు కేంద్ర ప్రభుత్వంవద్దనుండి, రిజర్వు బ్యాంకునుండి ఎప్పటి కప్పుడు 'ఓవర్ డ్రాఫ్టులను తీసుకుంటూనే ఉన్నాము. కొత్తగా రాష్ట్రాలను ఏర్పాటు చేయటంవలన పరిపాలనావ్యవస్థలో కలిగే ఒడుదుడుకులు, ఆరంభదశలో వుండే ఆటంకాలు, సిద్ధంగా లేకపోవటం, ఇన్ని ఇబ్బందులున్నప్పటికి, రెండవ ప్రణాళిక క్రింద రూ. 175 కోట్లు ఖర్చుచేయాలని సాహసంతో ఉద్యమించాము. ప్రభుత్వపు నిర్విరామకృషి మూలంగానూ, మన ప్రజల సహకారంవల్లనూ పరిపాలనా వ్యవస్థలోని లోటులను సర్దుబాటు చేసుకొనగలిగాము. అంతేకాదు. కొత్త రాష్ట్రపు ఆర్థిక వ్యవస్థను కూడా సుస్థిరం చేసుకోగలిగాము.

తత్ఫలితంగా పరిస్థితి ఇలా ఉన్నది. 1959-60 సవరించిన అంచనాల ప్రకారం, రివిన్యూ రూ. 78.08 కోట్లు, రివిన్యూ ఖర్చు రూ. 76.13 కోట్లు అని తేలింది. అంటే రివిన్యూ మిగులు రూ. 1.95 కోట్లు అన్నమాట. పెట్టుబడి వినియోగం రూ. 30.10 కోట్లకు పెరిగింది. 1960-61 బడ్జెటు అంకెలు ఇంకెక్కువ అభివృద్ధిని సూచించగలవు. రివిన్యూ జమలు రూ. 82.18 కోట్లు, రివిన్యూ ఖర్చు రూ. 81.98 కోట్లు ఉండగలవు. అంటే మిగులు రూ. 20 లక్షలు ఉంటుంది. పెట్టుబడి ఖర్చు వచ్చేసంవత్సరం రూ. 32.44 కోట్లదాకా వుంటుంది.

రివిన్యూ బడ్జెట్టులోని ముఖ్యమైన అభివృద్ధి పద్దుల క్రింద ఖర్చు ఎలా పెరుగుతున్నదీ, కింది అంకెలనుబట్టి తెలుసుకొనవచ్చును.

| పద్దు | ఖర్చు అంచనా (1956-57) | కేటాయింపు (1960-61) |
|---|---|---|
| 1 | 2 | 3 |
| *రివిన్యూఖాతా*:- | | |
| | రూ. లక్షలు | రూ. లక్షలు |
| వ్యవసాయం | 128 | 348 |
| పశువైద్యం | 51 | 143 |
| సహకారం | 55 | 195 |
| విద్య | 926 | 1525 |
| వైద్యం, ప్రజారోగ్యం | 328 | 728 |
| పరిశ్రమలు | 120 | 195 |
| సివిల్ పనులు | 301 | 529 |
| సమాజ వికాస కార్యక్రమాలు | 409 | 450 |

1960 మార్చి నెలాఖరుకు ప్రభుత్వ ఋణబాధ్యత రూ 186, కోట్లు ఉండవచ్చును.

ఒకొక్కప్పుడు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చి రిజర్వుబ్యాంకు నుంచి పెద్ద ఎత్తున 'ఓవర్ డ్రాఫ్టు' లను తీసుకోక తప్పేదికాదు. మరి ఒక ప్రక్క నేమో ఖర్చు త్వరగా పెరిగిపోతుండె. కాని రివిన్యూ వసూళ్లు అందుకు బరాబరుగా జరిగేవికావు. అందులోనూ కొన్ని వసూళ్లు ఏడాదిపొడుగునా కాక, కొన్ని తరుచాల్లోనే లభించగలవు. అయితే యిప్పుడా పరిస్థితి చాలవరకు కుదుటబడింది. ఇందుకు కారణాలు-ప్రణాళిక స్కీములకు కేంద్ర సహాయాన్ని మంజూరు చేసే విధానంలో కొన్ని మార్పులు జరగటం; పన్నులవిధింపు, ప్రజలనుంచి ఋణ సేకరణ, రివిన్యూ బకాయీల వసూళ్లు-వీటి విషయంలో మనం చేసిన కృషి. వీటిమూలంగా పరిస్థితి మారింది.

ఇప్పుడు 1958-59 లెక్కలగురించి, 1959-60 సవరించిన అంచనాలగురించి క్లుప్తంగా చెప్పి, 1960-61 బడ్జెటు ప్రతిపాదనలకు చెందిన ముఖ్యమైన అంశాలను గురించి వివరిస్తాను. వివరాలు ఆర్థిక కార్యదర్శి సమర్పించిన వివరణ నివేదికలోనూ, బడ్జెటుతోపాటు అందించిన ఇతర కాగితాల్లోనూ ఉదాహరించబడినవి.

బడ్జెటు ప్రతిపాదనల పరిశీలనను సులభం చేయటానికిగాను, తొలిసారిగా వివరణ నివేదికను కూడ తెలుగులో తయారుచేయటం జరిగింది. గౌరవసభ్యులు ఇందుకు హర్షిస్తారని నమ్ముతున్నాను. (హర్షం)

## 1958-59 లెక్కలు

1958-59 వ సంవత్సరం రూ. 3 00 కోట్ల రొక్కపు నిలవతో ప్రారంభమైంది ఆ ఏడాది రివిన్యూ జమలు రూ. 67.52 కోట్లు, రివిన్యూ ఖర్చు రూ 63.42 కోట్లు ఉండి, రివిన్యూ మిగులు రూ. 4.10 కోట్లు లభించింది. పెట్టుబడికాతా క్రింద ఖర్చు రూ 24.71 కోట్లు జరిగింది. ప్రభుత్వఋణం రూ 18 56 కోట్లకు పెరిగింది. డిపాజిట్లు, అడ్వాన్సులు, ఇతర అప్పు పద్దు వ్యవహారాల ఫలితంగా రూ. 5.00 కోట్ల నికర రాబడి తేలింది. ఆ ఏడాది రూ. 5.95 కోట్ల నిలవతో ముగిసింది.

## 1959-60 సవరించిన అంచనాలు

1959-60 బడ్జెట్ అంచనాల ప్రకారం, రూ. 72.04 కోట్ల మొత్తం రివిన్యూ క్రింది విధంగా సూచింపబడింది.

| | | రూ. కోట్లు |
|---|---|---|
| (అ) సాధారణ రివిన్యూ | ... | 66.29 |
| (ఆ) ప్రణాళిక పథకాలకు కేంద్ర గ్రాంట్లు | ... | 5.00 |
| (ఇ) క్రొత్త పన్ను విధానాల ద్వారా | ... | |
| ఆశించిన రాబడి | ... | 0.75 |
| మొత్తం | | 72.04 |

సవరించిన అంచనాలలో, ఇప్పటి పన్ను విధానాలు, వాణిజ్య వ్యవహారాలు వగైరాల ద్వారా రూ. 68.21 కోట్ల ఆదాయం రావచ్చునని లెక్కించబడింది. కేంద్ర గ్రాంట్లు రూ. 7.82 కోట్లు ఉండవచ్చును. ప్రయాణీకులమీద, సరకులమీద 1959 మార్చి నెలనుంచి ప్రవేశపెట్టిన పన్నుద్వారా రాబడి రూ 1.10 కోట్లు ఉండగలదని ఇప్పుడు అంచనా వేయబడింది. సాధారణ రివిన్యూ క్రింద కనబడిన రూ. 1.92 కోట్ల పెరుగుదలకు, ముఖ్యంగా రాష్ట్ర ఎక్సైజు సుంకాలు, అమ్మకం పన్ను, విద్యుచ్ఛక్తి పథకాలు తోడ్పడినాయి. కేంద్ర గ్రాంట్ల క్రింద రూ. 2.82 కోట్ల పెరుగుదల కన్పించింది. కేంద్ర ప్రభుత్వం సూచించిన పథకాల

నిమిత్తమై వచ్చే కేంద్ర సహాయాన్ని ఖర్చు తగ్గింపుగా చూపటానికి బదులు, జమగా చూపించటం వలన ఆ పెరుగుదల కన్పించింది. ఇతర రివిన్యూ పద్దులకు చెందిన తేడాలను గురించి, ఆర్థిక కార్యదర్శి వివరణ నివేదికలో తెలియచేయడ మైనది.

1959-60 బడ్జెట్ అంచనాల్లో రివిన్యూ ఖర్చు రూ 71.66 కోట్లుగా ఎంచ బడింది. అది ఇప్పుడు సవరించిన అంచనాల్లో క్రింది విధంగా రూ. 76.13 కోట్లకు పెరుగవచ్చును

| | బడ్జెటు అంచనా 1959-60 రూ. కోట్లు | సవరించిన అంచనా 1959-60 రూ. కోట్లు |
|---|---|---|
| (1) సాధారణ ఖర్చు | 57.91 | 59.32 |
| (2) ప్రణాళిక ఖర్చు | 13.75 | 16.81 |
| మొత్తం | 71.66 | 76.13 |

*రివిన్యూ మిగులు :—* 1995-60 సంవత్సరానికి మొదట్లో అను కొన్న రూ. 38 లక్షల రివిన్యూ మిగులు, పైమార్పుల ఫలితంగా ఇప్పుడు రూ. 1.95 కోట్లు ఉంటుంది.

*పెట్టుబడి ఖర్చు :—* బడ్జెటులో మొత్తం పెట్టుబడి వినియోగానికై రూ. 28.30 కోట్లు కేటాయించడం జరిగింది. ఇందులో రు. 24.75 కోట్లు ప్రణాళికా పథకాలకు, మిగతా, రూ. 3.55 కోట్లు ప్రణాళికలో లేని ఇతర ముఖ్య విషయాలకు కేటాయించబడినాయి. ఇప్పుడీ మొత్తాలు సవరించిన అంచనాల ప్రకారం వరుసగా రూ 24.84 కోట్లు, రూ. 5.26 కోట్లు ఉంటాయి. ప్రణాళికకు చెందని పథకాల పెట్టుబడి ఖర్చు క్రింద కన్పించే రూ. 1.71 కోట్ల పెరుగుదల, ముఖ్యంగా పారిశ్రామిక సంస్థల్లో పెట్టుబడుల క్రింద, ఎరువుల ఫ్యాక్టరీ కేటాయింపు క్రింద ఏర్పడింది.

*ప్రభుత్వ ఋణం :—* మొదటి అంచనాల ప్రకారం రూ. 6 కోట్ల ప్రభుత్వ ఋణాన్ని ఉద్దేశించగా, జరిగిన నికరపు వసూళ్లు మొత్తం రూ. 12.0 కోట్లు దాటింది. కాని ప్రకటన షరతులబట్టి, ప్రభుత్వం రూ. 6.54 కోట్లను మాత్రమే తీసుకోనగలిగింది. ప్రణాళికా పథకాలు వగైరాలకు కేంద్రం చేసే ఋణసహాయం, జీవితభీమా వ్యవస్థ, జాతీయ వ్యవసాయ పరపతి వ్యవస్థ, రిజర్వు బాంకు వగైరా

కొన్ని స్వతంత్ర సంస్థలుచేసే సహాయం రూ. 27.24 కోట్లు ఉండవచ్చునని అంచనా వేయబడింది. హైదరాబాదు ప్రభుత్వపు 1954-59 2½ శాతం ఋణపు వాటా క్రింద రూ. 4.35 కోట్లు, సంయుక్త మద్రాసు రాష్ట్రపు 1959, 3 శాతపు ఋణపు చెల్లింపు కింద రూ. 45 లక్షలు ప్రభుత్వం యీ ఏడాది సమకూర్చవలసి వచ్చినది. పై బాధ్యతలను నిర్వర్తించాక, కేంద్ర ఋణాల విషయమై దఫాలవారీ మొత్తాల చెల్లింపుకింద చేయవలసిన కేటాయింపు జరిగాక, 1959-60లో రాష్ట్ర ప్రభుత్వ ఋణపు నికరపు పెరుగుదల రూ. 17.05 కోట్లు ఉండగలదని అంచనా వేయబడింది.

*డిపాజిట్లు, అడ్వాన్సులు :-* 1959-60లో అప్పు, డిపాజిట్లు వగైరా వ్యవహారాల ఫలితంగా రూ. 26 లక్షల నికరపు రాబడి లభించింది.

*రొక్కపు నిలవ :-* 1959-60 సంవత్సరము బడ్జెటు అంచనాలలో ఊహించబడినట్లు రూ. 1.44 కోట్ల లోటుతో కాక రూ. 4.89 కోట్ల లోటుతో ముగియవచ్చునని తేలింది. దీనికి ముఖ్య కారణం ఇది: ప్రస్తుత సంవత్సరానికి ప్రణాళికా వినియోగానికై బడ్జెటు అంచనాలలో రూ 42.03 కోట్లు కేటాయించబడినది. కాని సవరించిన అంచనాల ప్రకారం, వినియోగం రూ. 44.21 కోట్లు ఉన్నది.

## 1960-61 బడ్జెట్ అంచనాలు

ఇక 1960-61 సంవత్సరపు నా బడ్జెట్ ప్రతిపాదలను గురించి వివరిస్తాను.

## రివిన్యూ

ఇప్పటి పన్నులు, వాణిజ్య వ్యవహారాలు, కేంద్ర ప్రభుత్వపు పన్నుల్లో రాష్ట్రవాటా, ప్రణాళికాపథకాలతో సహా వివిధ ప్రయోజనాలకై లభించే కేంద్ర గ్రాంట్లు, వీటి ద్వారా 1960-61లో వచ్చే రివిన్యూ రూ. 82.18 కోట్లు వుంటుందని అంచనా వేయబడింది. 1959-60 సవరించిన అంచనాల్లో రివిన్యూ రూ. 78.08 కోట్లు వుంటుందని భావించబడింది. ఈ రూ. 4.10 కోట్ల అభివృద్ధి ముఖ్యంగా ఇలా జరిగింది :-భూమి రివిన్యూ (రూ. 50 లక్షలు); రాష్ట్ర ఎక్సైజు సుంకాలు (రూ. 42 లక్షలు); అమ్మకం పన్ను (రూ. 52 లక్షలు) మిగతా పన్నులు, సుంకాలు (రూ. 29 లక్షలు), పరిశ్రమలు, సప్లయ్‌లు (రూ. 27 లక్షలు); కేంద్ర గ్రాంట్లు, పన్నులు (రూ. 164 లక్షలు); అవీ యివీ (రూ. 46 లక్షలు).

*1960-61* సంవత్సరానికి అంచనావేసినట్టి రూ. *82.8* కోట్లలో విద్యుచ్ఛక్తి సంస్థ, రోడ్డు రవాణా సంస్థల సంపాదనలను చేర్చలేదు. పూర్వపు

విద్యుచ్ఛక్తి శాఖను, రోడ్డు రవాణాశాఖను స్వతంత్ర సంస్థలుగా మార్చి, వీటిని రూపొందించటం జరిగింది ఈ రెండు శాఖలు ప్రభుత్వంతోనే కలసివుంటే, నేటి రివిన్యూ రూ. 90 కోట్లు దాటేది.

## రివిన్యూ ఖర్చు

1960–61 బడ్జెట్ అంచనాల ప్రకారం, మొత్తం రివిన్యూ ఖర్చు రూ. 8.198 కోట్లు ఉంటుంది. ఇందులో ప్రణాళికా వినియోగపు రివిన్యూభాగం రూ. 19 47 కోట్లు ఉంటుంది. మిగతాది ఇప్పటి 'సర్వీసెస్' వగైరాల నిర్వహణ క్రింద అవుతుంది. వివరాలు .—

(రూ కోట్లు)

| పద్దు | సవరించిన అంచనా 1959–60 | బడ్జెట్ అంచనా 1960–61 | పెరుగుదల |
|---|---|---|---|
| సాధారణఖర్చు | 59.32 | 62.51 | 3.19 |
| ప్రణాళిక ఖర్చు | .16.81 | 19.47 | 2 66 |
| మొత్తం | 76 13 | 81.98 | 5 85 |

రానున్న సంవత్సరపు రివిన్యూ ఖర్చులో పెరుగుదలకు ముఖ్య కారణాలు- గ్రేడు జీతపు హెచ్చింపుల మూలంగా మామూలుగా పెరిగే ఖర్చు, రెండవ భాగపు పథకాలకోసం చేసే కేటాయింపు. ఈ పథకాల జాబితా ఆర్థిక కార్యదర్శి వివరణ నివేదికలో ఉదాహరించబడింది. వీటిలో కొన్ని రాష్ట్రీ ప్రణాళికకు చెందినట్టివి ; మిగతావి పరిపాలనా శాఖల అత్యవసరాలకు చెందినట్టివి. ప్రణాళిక లో వీటికి తగిన కేటాయింపు చేయటానికి వీలులేకపోయింది. కొత్తగా ఖర్చు అయ్యే ముఖ్యమైన అంశాలను కొన్నిటినే పేర్కొంటున్నాను. ఇందుకు తగిన కేటాయింపు 1960-61 ఖర్చు కార్యక్రమంలో చేయబడింది.

(1) రూ. 9 లక్షలు (గ్రాంటు రూ. 4 లక్షలు ; ఋణం రూ. 5 లక్షలు) విశాఖపట్నం సముద్రతీరపు అభివృద్ధులకుగాను కేటాయించబడింది.

(2) పోలీసు శాఖలోని మోటారుబండ్లకు చాలా వాటికి అయుష్కాలం పూర్తిఅయింది. ఇక వాటి వాడకం లాభసాటి కాదు. అలాంటి కాలంతీరినట్టి, లాభసాటి కానట్టి బండ్లస్థానే కొత్తవాటిని కొనటానికి రూ. 45 లక్షలు అవసరం అవుతుంది. ఈ మొత్తాన్ని అయిదు సంవత్సరములలో ఖర్చు చేయాలని ఉద్దేశించటం జరిగింది. బడ్జెటులో రూ. 9 లక్షల మొత్తం కేటాయించబడింది.

(3) రివిన్యూశాఖ కూడా రివిన్యూ అధికార్ల నిమిత్తమై, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతపువారి నిమిత్తమై జీపులు కావాలని వత్తిడిచేస్తోంది. ఇందుకై రూ 10 లక్షలను కేటాయించటం జరిగింది.

(4) కరీంనగర్, మహబూబ్‌నగర్, తాడేపల్లిగూడెం, తాడపత్రి, నరిస రావుపేట, మదనపల్లివద్ద అగ్నిమాపక కేంద్రాలను స్థాపించటానికి అగ్నిమాపక శాఖకు అవసరమైన జలాశయాల నిర్మాణానికి, మిగతా పనులకు రూ. 4.71 లక్షల మొత్తం కేటాయించబడింది

(5) గ్రామాలలో రహదార్ల అభివృద్ధికై పంచాయతీలకు గ్రాంట్లనిచ్చే నిమిత్తమై రూ. 8 లక్షల మొత్తంకేటాయించబడింది.

(6) రెండవతరగతి పంచాయతీలకు చెందినట్టి పన్నుల అప్పగింత మూలంగా లోకల్ ఫండ్ ఆడిట్ శాఖ బాధ్యతలు పెచ్చినాయి ఇందువలన ఆ సంస్థను విస్తరించి, బలపరచవలసిన అవసరం ఏర్పడింది. అందుకై రూ. 4.40 లక్షల మొత్తం కేటాయించబడింది.

(7) సంయుక్త మద్రాసు రాష్ట్రంలోనూ, కొంతకాలంపాటు ఆంధ్ర రాష్ట్రంలో కూడ "టోలుపన్ను" ద్వారావచ్చే ఆదాయపు నష్టానికి, మోటారు బండ్లపై లైసెన్సుల రుసుముల విషయంలోను పరిహారాన్ని ప్రభుత్వంనుంచి పొందేహక్కు పురపాలక సంఘాలకు వుండేది. ఈ కాతా క్రింద ప్రభుత్వం దాదాపు రూ. 5 00 లక్షలు ఖర్చు చేసేది. ఆ తర్వాత మాత్రం ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇస్తున్న మిగతా గ్రాంటులతోపాటు ఈ గ్రాంటునుకూడ ఉపసంహరించటానికి నిశ్చయించింది. ఎందుకంటె నిర్బంధ ప్రాథమిక విద్యాకార్యక్రమానికై ప్రభుత్వం డబ్బు సమకూర్చవలసివున్నది. పురపాలక సంఘాలకు ఈ గ్రాంటును మళ్ళీ 1960-61 బడ్జెట్ సంవత్సరం నుంచి వర్తింపజేయాలని ఉద్దేశించటం జరిగింది.

(8) వినోదపు పన్ను రాబడిలో 80 శతిని పొందే హక్కు ప్రస్తుతం పుర పాలక సంఘాలకున్నది. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం వసూళ్ళు వగైరా బాధ్యతల నిమిత్తమై వుంచుకుంటుంది. అయితే ఇలా మినహాయించే 20 శాతం అధికంగా వున్నట్లు ఇదివరలో అనేక సందర్భాల్లో విజ్ఞప్తులు చేయబడినాయి. అందుకని పురపాలక సంఘాల వాటాను 80 శతినుంచి 90 శతికి పెంచాలనే ప్రతిపాదన జరిగింది. తత్ఫలితంగా పురపాలక సంఘాలకు ఇంకా సుమారు రూ. 7.66 లక్షల మొత్తాన్ని చెల్లించవలసి వున్నది.

(9) హరిజనుల గృహపథకాలకోసం, వెనుకబడిన తరగతులు వగైరాల విద్యాసౌకర్యాలకోసం 1959-60 బడ్జెట్ అంచనాల్లో రూ 10 లక్షల మొత్తం ప్రత్యేకంగా కేటాయించబడింది. వచ్చే ఏడాదినుంచి ఈ కేటాయింపును రూ. 20 లక్షలదాకా పెంచాలని ఉద్దేశించాం. వివరాలు:-

| | 1959-60 కేటాయింపు | 1960-61 లో ఉద్దేశించిన కేటాయింపు |
|---|---|---|
| | (రూ లక్షలు) | |
| (అ) హరిజనుల గృహపథకాలకై అదనపు కేటాయింపు | 4 | 10 |
| (ఆ) వెనుకబడిన తరగతుల విద్యాసౌకర్యాలకై అదనపు కేటాయింపు | 3 | 5 |
| (ఇ) వెనుకబడిన తరగతులకు చెందకుండా, ఆర్థికంగా వెనుకబడియున్న బాల బాలికలకు అదనపు కేటాయింపు | 3 | 5 |

హరిజనుల గృహపథకాలకై మామూలు బడ్జెటులో చేసిన రూ. 3.92 లక్షల కేటాయింపుకు, 1960-61 సంవత్సరానికి ప్రణాళికలో చేసిన రూ. 22.55 లక్షల కేటాయింపుకు అదనంగా ఈ పై మొత్తాలు సమకూర్చబడినాయి.

(10) హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలో నిరుద్యోగ తీవ్రతను తగ్గించేందుకై, చిన్న పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయటానికిగాను తగిన సూచనలు చేయవలసిందిగా, కొంతకాలం క్రితం ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం చేసిన సూచనలు పరిశీలించబడుతున్నాయి. ఈ లోపు, ప్రభుత్వామోదం పొందాక పథకాలను ప్రారంభించేందుకై 1960-61 బడ్జెటులో రూ. 10.0 లక్షల మొత్తం కేటాయించబడింది. ఇందులో ఒక లక్ష రివిన్యూ అంచనాలోనూ, మిగతా మొత్తం పెట్టుబడి బడ్జెటులోనూ, పొందుపరచటం జరిగింది. అవసరమైతే పారిశ్రామిక నిధి ఆదాయంనుంచి కొంత తీసుకొని, ఈ ఏడాది గడువులో ఈ కేటాయింపును పెంచటం కూడా జరుగుతుంది.

(11) పరికరాలు, మందులు, వివిధ ఆసుపత్రుల్లోని రోగుల ఆహారపు ఖర్చు వీటికి చేసే కేటాయింపు సరిపడునంతగా లేదని వైద్యశాఖ తెలియచేస్తోంది.

పరిస్థితులను పరిశీలించగా, ముఖ్యంగా తెలంగాణా ఆసుపత్రుల విషయంలో వెంటనే తగుశ్రద్ధను చూపించటం అవసరం అని తేలింది. వచ్చే ఏడాది బడ్జెటులో ఇందుకై రూ. 24.0 లక్షల ప్రత్యేక గ్రాంటు కేటాయించబడింది.

(12) రాష్ట్రీ రహదార్ల, పెద్ద జిల్లా రోడ్ల నిర్వహణకు ప్రస్తుతం ఇస్తున్న గ్రాంట్లు అందుకు సరిపోవని రహదార్ల ప్రధాన ఇంజనీర్ విజ్ఞప్తిచేశాడు. అందుకని, 1960-61 లో రూ 35.00 లక్షల అదనపు మొత్తాన్ని కేటాయించాలని ప్రతిపాదించటం జరిగింది.

(13) ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ 4.0 లక్షల అడ్-హాక్ ఒకే దఫా గ్రాంటును, మిగతా రెండు విశ్వవిద్యాలయాలకు చెరివొక రూ 2.0 లక్షల గ్రాంటును ఇవ్వాలని కూడా ఉద్దేశించబడింది. ఇందుమూలంగా 1960-61 లో వాటి మామూలు బడ్జెటు అవసరాలు తీరుతాయి.

## రివిన్యూ మిగులు

ఇంతకుముందే నేను ప్రస్తావించిన రెండవ భాగపు పథకాలకు కేటాయింపును చేశాక, 1960-61 రివిన్యూ అంచనాలు మొత్తం రూ. 20 లక్షల మిగులును సూచిస్తున్నాయి.

## పెట్టుబడి వినియోగం

1960-61 పెట్టుబడి వినియోగ కార్యక్రమం క్రింద మొత్తం రూ 32.44 కోట్లు యీ క్రింద చూపబడిన విధంగా ఖర్చు అవుతుంది.

| | రూ. లక్షలు |
|---|---|
| నీటి పారుదల ... ... | 1,677.68 |
| విద్యుచ్ఛక్తి (విద్యుచ్ఛక్తి సంస్థద్వారా జరిగే పెట్టుబడి ఖర్చు మినహా) ... ... | 291.82 |
| సివిల్ పనులు ... ... | 577.12 |
| ప్రజారోగ్య పథకాలు ... ... | 108.67 |
| పారిశ్రామిక సంస్థల్లో, వ్యవహారాల్లో పెట్టుబడి ... | 339.64 |
| జమీందార్లకు నష్టపరిహారం ... ... | 129.86 |
| పింఛనుల మార్పిడి, ఇతర వివిధాంశాలు ... | 119.52 |
| మొత్తం | 3,244.31 |

పెట్టుబడి వినియోగానికి చెందినట్టి ముఖ్యాంశములు :—

| | | రూ. లక్షలు |
|---|---|---|
| 1. | నాగార్జున సాగర్ ప్రాజెక్టు | 900 00 |
| 2. | తుంగభద్ర ఎగువ కాలవ | 133.69 |
| 3. | వంశధార ప్రాజెక్టు | 10.00 |
| 4. | కర్నూలు–కడప కాలవ | 22.00 |
| 5. | రాజోలిబండ మళ్ళింపు పథకం | 40.00 |
| 6. | కడం ప్రాజెక్టు | 50 00 |
| 7. | పోచంపాడు ప్రాజెక్టు | 60.00 |
| 8. | మూసీ ప్రాజెక్టు | 30.00 |
| 9. | తుంగభద్ర–హైడ్రో–థర్మల్ పథకం | 67.00 |
| 10. | ఎగువ సైలేరు జల–విద్యుచ్ఛక్తి పథకం | 92.45 |
| 11. | శ్రీశైలం జల–విద్యుచ్ఛక్తి పథకం (తొలిపనులు) | 15.00 |
| 12. | తెలంగాణా హైడ్రో–థర్మల్ పథకం | 45.35 |
| 13. | గ్రామీణ విద్యుచ్ఛక్తి | 116.91 |
| 14. | కొత్తగూడెం విద్యుత్ పథకం (తొలిపనులు) | 20.00 |
| 15. | ఆంధ్ర పేపరు మిల్లులు | 70.00 |
| 16. | ఎరువుల ఫ్యాక్టరీ | 150.00 |
| 17. | సెక్రటేరియట్ కట్టడాలు | 20 00 |
| 18. | పోలీసు కట్టడాలు | 37.16 |

ధవళేశ్వరం వద్ద ఆనకట్ట తలుపులను 3 అడుగులనుంచి 6 అడుగులదాకా పెంచటానికి ఈ ఏడాది బడ్జెట్‌లో నిమిత్తమాత్రంగా రు. 100 లు కేటాయించాము. ఈ కార్యక్రమంవల్ల ఉపయోగంపొందే వారినుండి, తదితరులనుండి కావలసిన ధనాన్ని సేకరించి ఈ ఏడాది ఈ ప్రాజెక్టుకు పూనుకోవచ్చునని ఆశించాము. ఈ పథకానికి రు 2.70 కోట్లు ఖర్చు అవుతుంది. మొదటి పంట క్రింద 1,10,000 ఎకరాలు, రెండవ పంట క్రింద 60,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీటివసరు లభిస్తుంది. వివిధ కారణాల మూలంగా ఈ పథకాన్ని ఈ ఏడాదే ప్రారంభించటం పడలేదు. అందుకనే వచ్చే ఏడాది బడ్జెటులో మళ్ళీ నిమిత్తమాత్రంగా రు. 100 లు కేటాయించటం జరిగింది. మిత్రుడు, పబ్లిక్ వర్క్సుశాఖ గౌరవ మంత్రి ఈ బడ్జెట్ సంవత్సరములో, పథకానికి కావలసిన డబ్బును సేకరించేందుకై పూనుకోవాలని అనుకుంటున్నారు. ఈ సందర్భంలో అప్పుడే కొన్ని ప్రాథమిక చర్యలను గురించి పరిశీలన జరుగుతోంది.

సివిల్ పనుల మొత్తంలో క్రింది అంశాలు ఇమిడి వున్నాయి :—

(1) యం. యల్. ఏ. ల క్వార్టర్సులో ఉంటున్న శాసనసభ్యులకు నివాస వసతి కల్పించేందుకుగాను, శాసనసభ్యుల ఇప్పటి హాస్టళ్ళను విస్తరించి, పెద్దవి చేయటానికి రు. 6 లక్షల మొత్తం కేటాయించబడింది ఖాళీ అయ్యాక యం. యల్. ఏ. ల క్వార్టర్సును జూనియర్ అధికార్లకు, యన్. జి. ఓ. లకు కేటాయించాలి. వీరి విషయంలో ఇళ్ళ ఎద్దడి సమస్య హెచ్చుగా వున్నది.

(2) హైదరాబాదులో నగర సివిల్ కోర్టుకు తగిన కట్టడాన్ని నిర్మించేందుకై రు. 6 లక్షల కేటాయింపు ఒరిగింది.

(3) జాతీయ నాటక మందిరానికి ఒక భవంతిని నిర్మించేందుకై రు. 10 లక్షల మొత్తం కేటాయించబడింది. ఇందులో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది,

(4) ఫతేమైదానులో క్రీడా మందిరాన్ని నిర్మించడానికి ప్రథమంగా రు. 5 లక్షలు కేటాయించబడినాయి. పని వేగంబట్టి ఇంకెక్కువ ధనం సమకూర్చబడుతుంది.

(5) మంత్రులకు కొంది నివాస భవనాలను, కార్యదర్శులకు, ఉప కార్యదర్శులకు, ఇతర పెద్ద అధికార్లకు నివాస భవనాలను నిర్మించవలసిన అవసరం వుంది. 1960–61 లో ముందుగా మంత్రులకు 6 నివాస భవనాలను, కార్యదర్శులకు, 6 ఉప కార్యదర్శులకు 12 నివాస భవనాలను నిర్మించాలని వున్నది. నివేశన స్థలవు ఖరీదు. ఇతర చిల్లర మల్లర ఖర్చులతో సహా ఇందుకు మొత్తం రు. 16 లక్షలు ఖర్చు అవుతుంది.

(6) ప్రజారోగ్యపు అభివృద్ధి కార్యక్రమంలో మంజీరా నీటి సప్లై పథకానికి రు. 78.00 లక్షలు కేటాయించబడినవి. ఈ పథకం మూలంగా హైదరాబాదు, సికింద్రాబాదు జంట నగరాలకు నీటి సప్లై అధికం కాగలదు. దీనికి రు. 2.75 కోట్లు ఖర్చు కావచ్చును.

(7) నెల్లూరు, అనంతపురం, శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప జిల్లాలలో జామవు రోడ్లను పూర్తి చేయటానికై రు. 15 లక్షల మొత్తం కేటాయించబడింది,

ఆంధ్ర పేపర్ మిల్స్ ఉత్పత్తిని అధికం చేసే కార్యక్రమానికి గాను, ముఖ్యమైన పరికరాల కొనుగోలుకు, మిగతా పెట్టుబడి ఖర్చుకు వచ్చే షడాది బడ్జెటులో

రు. 70.00 లక్షల మొత్తం కేటాయించబడింది. ముడిపదార్థాలు, వేతనాలు వగైరాలకు క్రితం సంవత్సరాల్లోటన్నా ఎక్కువ మొత్తాలు కేటాయించబడినాయి.

## ఋణాలు, అడ్వాన్సులు

| | | రు. లక్షలు |
|---|---|---|
| 1) నీటి సప్లయి, మురుగు పారుదల, రోడ్లు వగైరా పనులకై పురపాలకసంఘాల కిచ్చే ఋణాలు | ... | 81.50 |
| 2) వ్యవసాయదార్లకు అడ్వాన్సులు— | | |
| (అ) అమ్మోనియం సల్ఫేట్ సప్లయికుగాను తక్కువ గడువు ఋణాలు | ... | 160.00 |
| (ఆ) విత్తనాల అధికోత్పత్తి పంపకపు పథకాలు | ... | 16.00 |
| (ఇ) ఇతర తక్కావీ అడ్వాన్సులు | ... | 74.79 |
| (ఈ) వ్యవసాయ ఋణాల చట్టం క్రింద ఋణాలు | ... | 50.00 |
| 3) చిన్న పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు అడ్వాన్సులు | ... | 26.53 |
| 4) సమాజ వికాసపు ప్రాజెక్టుల క్రింద జాతీయ విస్తరణ సేవా పథకాల క్రింద ఋణాలు | ... | 102.88 |
| 5) పారిశ్రామిక గృహ వసతి పథకాలకు, తక్కువ ఆదాయపు వర్గాల గృహ వసతి పథకాలకు ఋణాలు | ... | 153.78 |
| 6) సహకార భూమి తనఖా బ్యాంకులకు తక్కువ గడువు ఋణాలు | ... | 42.00 |
| 7) సహకార విక్రయ విధానపు అభివృద్ధి పథకం క్రింద సహకార సంఘాలకు ఋణాలు | ... | 34.73 |

దుమ్ము లేగని రోడ్లు వేయటానికి, సిమెంటు రోడ్లు వేయటానికి ఆంధ్ర ప్రాంతంలో రు. 4 లక్షలు, తెలంగాణా ప్రాంతంలో రు. 11.5 లక్షలు మొత్తం రు. 15.50 లక్షలు ఋణాల క్రింద పురపాలక సంఘాలకు కేటాయింపబడినాయి.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టపు లక్ష్యాలను నెరవేర్చగలిగేందుకుగాను, స్థానిక సంస్థలకు అడ్వాన్సులు ఇవ్వటానికై రు. 50 లక్షల మొత్తం కేటాయించబడింది.

సాంకేతిక, వృత్తి కళాశాలల విద్యార్థులకు విద్యా ఋణాల గ్రాంటుకై గాను బడ్జెటులో రు. 2 లక్షలు ప్రత్యేకంగా కేటాయించబడినవి. ఆర్థిక సహాయం అవసరంగావున్న ప్రతిభాశాలులైన యువతీయువకులకు ఇందుమూలంగా తగిన సహాయం చాలవరకు లభించగలదు.

## స్థానిక సంస్థలకు గ్రాంట్లు

ప్రజాస్వామిక వికేంద్రీకరణ, జిల్లా పరిషత్తులు, పంచాయితీ సమితుల స్థాపన మూలంగా స్థానిక సంస్థల ఆర్థిక బాధ్యతలు అధికమైనాయి. ఇందు మూలంగా పంచాయితీ సమితులకు, పంచాయితీలకు తగినంత ఆర్థిక వసతిని సమకూర్చటం అవసరమైంది. అప్పుడుగాని ఇవి సరిగ్గా పనిచేయగలిగి, తమపరం చేసిన బాధ్యతలను సరిగా నిర్వహించలేవు. కాబట్టి పంచాయితీలకు, పంచాయితీ సమితులకు వార్షిక గ్రాంటులను క్రింది విధంగా మంజూరు చేయటానికి నిశ్చయించటం జరిగింది.—

(1) ప్రతి పంచాయితీ సమితికి జనాభాలో ప్రతివ్యక్తికి 25 న.పై. చొప్పున పంచాయితీ సమితులన్నీ ఏర్పడ్డాక ఇందుకుగాను ఏడాదికి సుమారు రు. 65 లక్షలు అవుతుంది. ఇప్పటికి ఏర్పాటైన సమితుల వైశాల్యం, జనాభాబట్టి; వచ్చేఏడాది ఏర్పాటయ్యే వాటి వైశాల్యం, జనాభాబట్టి, వచ్చేఏడాది బడ్జెటులో రు. 40 లక్షల మొత్తం కేటాయించబడింది.

(2) ప్రతి పంచాయితీకి జనాభాలో ప్రతివ్యక్తికి 25 న. పై. చొప్పున, ఏడాదికి ఇందుకవుతుందనుకొన్న రు. 65 లక్షల మొత్తం ఈ బడ్జెటులో చేర్చబడింది.

(3) ప్రతి పంచాయితీకి జనాభాలో ప్రతివ్యక్తికి 25 న. పై. చొప్పున, ఇది "సమానత్వపు నిధి"కి జమకట్టబడుతుంది. వెనకబడి, ప్రత్యేక సహాయం అవసరంగా వున్న పంచాయితీలకు తోడ్పడటానికిగాను ఈ నిధి ఏర్పాటు చేయబడింది. ఇందుకు కూడ ఏడాదికి రు. 65 లక్షలు కావచ్చును. ఈ మొత్తం బడ్జెటులో కేటాయించబడింది. ఈ రు. 65 లక్షల్లో, రు. 30 లక్షలను గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన నీటి సప్లయి స్కీములకు ప్రత్యేకించాలని ప్రతిపాదించటం జరిగింది.

(4) రహదార్ల సౌకర్యాలభివృద్ధికిగాను, ప్రతి పంచాయితీ సమితికి జనాభాలో వ్యక్తికి 30 న. పై. చొప్పున వార్షిక గ్రాంటును ఇవ్వటానికి నిశ్చయించటం జరిగింది టోల్సు, లైసెన్సు రుసుముల మూలంగా కలిగే ఆదాయపు నష్టాన్ని భర్తీ చేయటానికని ఇది ఉద్దేశించబడింది. దీనికై ఏడాదికి రు. 78 లక్షలు కావచ్చునని అంచనా వేయబడింది.

పై గ్రాంటుల కదనంగా, రు. 50 లక్షల మొత్తం స్థానిక సంస్థలకు ఋణాల నిచ్చేందుకై కేటాయించబడింది. ఇందుమూలంగా అవి తమ బాధ్యతలను నిర్వర్తించ గలుగుతాయి,

జిల్లా పరిషత్తులకు అధ్యక్షులుగా ఎన్నికైన శాసనసభ్యులను అభినందిస్తున్నాను. ప్రజాస్వామిక వికేంద్రీకరణ పథకాన్ని జయప్రదంచేసి, గ్రామీణ ప్రజలకు చిరస్థాయిగావుండే ప్రయోజనాలను చేకూర్చగలిగేందుకై ఉత్తమంగా కృషి చేస్తారని నేను గట్టిగా నమ్ముతున్నాను.

## సాధన సదుపాయాలు

రూ. 1.44 కోట్ల లోటు నిలవతో ముగుస్తుందనుకున్న 1959–60 సంవత్సరం ఇప్పుడు రు. 4.89 కోట్ల లోటు నిలవతో ముగుస్తుందని తేలింది. అంటే ఈ మొత్తమే 1960–61 సంవత్సరపు ప్రారంభపు నిలవ అన్నమాట. రివిన్యూ అంచనాల ప్రకారం రు. 20 లక్షల మిగులు లభించవచ్చును. ఇక కేంద్ర ప్రభుత్వం, రిజర్వుబ్యాంకు, ఇతర సంస్థలు ఇచ్చే ఋణాలు, చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం, బహిరంగ మార్కెటు ఋణాల మూలంగా రు. 35.22 కోట్లు లభించవచ్చును. పెట్టుబడి ఖర్చు రు. 32.44 కోట్లు అవుతుంది. డిపాజిట్లనుండి వసూళ్ల జమను లెక్కలోకి తీసుకున్న తర్వాత ఋణాల చెల్లింపుకు, ఋణాల, అడ్వాన్సుల కాతా క్రింద నికర పంపకాలకు రు. 9.21 కోట్లు అవసరం అవుతుంది. 1959–60 లో, 1960–61 లో ఎరువుల ఫాక్టరీమీద పెట్టుబడికి తగిన ధనాన్ని సమకూర్చటానికిగాను, సెక్యూరిటీలను రు. 2.5 కోట్లవరకు రొక్కంచేసుకోవాలని ఉద్దేశించటం జరిగింది. మొత్తం మీద ఈ ఏడాది వ్యవహారాల ఫలితంగా రు. 3.73 కోట్ల తరుగు ఏర్పడవచ్చును. అంటే రొక్కపు నిలవ ఇంకెక్కువగా, రు. 8.62 కోట్ల లోటుకు తగ్గవచ్చును.

## ప్రభుత్వ ఋణం

1959 మార్చి నెలాఖరుకు ప్రభుత్వ ఋణబాధ్యత రు. 168.85 కోట్ల స్థాయిలో ఉన్నది. ఈ సంవత్సరం, ప్రభుత్వం ప్రజలనుంచి కొత్తగా రు. 8.54

కోట్లు ఋణంగా తీసుకొన్నది ప్రణాళికా పథకాలకు, ఇతర విషయాలకు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఋణాలు రు. 27.24 కోట్ల వరకు లభించినవి. పూర్వ హైదరాబాదు రాష్ట్రపు, సంయుక్త మద్రాసు రాష్ట్రపు ప్రభుత్వ ఋణాల్లో ఇప్పటి మన రాష్ట్రపు వాటాను చెల్లించటానికి తగిన కేటాయింపును చేసిన తర్వాత, 1960 మార్చి ఆఖరుకు ప్రభుత్వ ఋణ బాధ్యత రు. 185.90 కోట్లు ఉండవచ్చును. ప్రణాళికా పథకాలకు, ఇతర విషయాలకు వచ్చే ఏడాది కేంద్ర ప్రభుత్వ ఋణ సహాయం సుమారు రు. 22.22 కోట్లు లభించవచ్చుననే ఉద్దేశ్యంతోను; బహిరంగమార్కెటు ఋణంద్వారా, చిన్నమొత్తాల పొదుపు ఉద్యమం ద్వారా సుమారు రు. 13.00 కోట్లను సంపాదించగలమనే ఉద్దేశ్యంతోను 1960-61 బడ్జెటు అంచనాలను తయారుచేయటం జరిగింది. కేంద్ర ప్రభుత్వంనుంచి, ప్రజలనుంచి ఇదివరలో తీసుకొన్న వివిధ ఋణాల విషయంలో వచ్చే ఏడాది చేయవలసిన చెల్లింపులకుగాను రు. 11 25 కోట్లు కేటాయించబడినాయి. తత్ఫలితంగా 1960-61 అంతానికి ప్రభుత్వ ఋణబాధ్యత రు. 209.87 కోట్లదాకా పెరిగిపోవచ్చును. అంటె, 31-3-60 నాటికన్న రు. 23.97 కోట్లు అధికంగా ఉంటుందన్నమాట.

పై పరిశీలన బట్టి తేలిన విషయం ఇది:-వచ్చే ఏడాది ప్రజలనుంచి రు. 13.00 కోట్లు అప్పు తెచ్చుకుంటే, 1960-61 లో చెల్లించవలసిన ఋణాల దఫాలవారీ మొత్తాలను సర్దుబాటు చేసుకోటానికిగాను రు. 11.25 కోట్లదాకా అవసరం వుంటుంది. అంటే, ప్రణాళికా పథకాలకు లభించే ఆర్థిక వసతులకు తోడ్పడటానికి ఇంచుమించు ఏమీ మిగలదన్నమాట. ఇది కొంచెం ఆందోళననే కలిగిస్తోంది. ముఖ్యంగా మూడవ ప్రణాళిక ఆర్థిక అవసరాల సందర్భంలో కొంత చిక్కుగానే వున్నది. అయితే మన అవసరాలను నిర్ధారించేప్పుడు, రానున్న ఆర్థిక సమితి ఈ విషయాన్ని లెక్కలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

## రెండవ పంచవర్ష ప్రణాళిక అభివృద్ధి

మన రాష్ట్రపు రెండవ పంచవర్ష ప్రణాళిక మొత్తం వినియోగం రు. 175.74 కోట్లు ఉండవచ్చునని అంచనా వేయబడింది. ఇప్పటివరకు తయారైన అభివృద్ధి నివేదికలబట్టి చూస్తే, ప్రణాళిక మొదటి మూడు సంవత్సరాల్లో, అంటే 1956-57 నుంచి 1958-59 వరకు జరిగిన ఖర్చు రు. 91.59 కోట్లు అని తేలింది. వివరాలు:—

(రు. కోట్లు)

| సంవత్సరం | ఆంధ్ర | తెలంగాణ | మొత్తం |
|---|---|---|---|
| 1956—57 | 20.56 | 4.94 | 25.50 |
| 1957—58 | 21.63 | 9.45 | 31.08 |
| 1958—59 | 22.55 | 12.46 | 35.01 |
| మొత్తం | 64.74 | 26.85 | 91.59 |

ప్రణాళికా పథకాల క్రింద 1959—60 బడ్జెట్ అంచనాల్లో రు. 42.03 కోట్లు కేటాయించబడినాయి ఇందులో ఆంధ్ర ప్రాంతపు వంతు రు. 26.02 కోట్లు తెలంగాణ ప్రాంతపు వంతు రు. 16.01 కోట్లు. జరిగే ఖర్చు రు 40 కోట్లు ఉండ వచ్చును వివిధ శాఖలు సమర్పించిన సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం ఖర్చు రు. 44.21 కోట్లు ఉంటుంది — ఆంధ్ర ప్రాంతానికి రు. 26.80 కోట్లు, తెలంగాణా ప్రాంతానికి రు. 17.41 కోట్లు. సవరించిన అంచనాల్లోని పెరుగుదల ముఖ్యంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు (రు. 1.50 కోట్లు) క్రింద, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల (రు. 1.00 కోటి) క్రింద చేసిన అధిక కేటాయింపుల ఫలితంగా సంభ వించింది. ఇక 1960.61 సంవత్సరానికి ప్రణాళికా పథకాలకు బడ్జెట్‌లో క్రింది విధంగా రు. 44 04 కోట్లు కేటాయించబడినాయి:—

| | | రు. కోట్లు |
|---|---|---|
| 1. | రెవెన్యూ | 15.33 |
| 2. | పెట్టుబడి | 24.35 |
| 3. | ఋణాలు | 4.36 |
| | మొత్తం | 44.04 |

కేంద్ర ప్రభుత్వం సూచించే పథకాలకై జరిగే ఖర్చులోని కేంద్ర ప్రభుత్వపు వాటాను పై అంకెల్లో చేర్చలేదు. ఈ పథకాలు కేంద్ర ప్రభుత్వ ప్రణాళికల్లో మాత్రమే ఉదహరించబడుతాయి. రాష్ట్ర ప్రణాళిక రాష్ట్ర వాటాను మాత్రమే చూపిస్తుంది. మరి ఈ కేంద్ర ప్రభుత్వ వాటా రు. 6.80 కోట్లు ఉంటుంది.

రు. 44.00 కోట్ల ప్రణాళిక కేటాయింపు వివిధ అభివృద్ధి రంగాలకు క్రింది విధంగా పంచబడుతుంది.

| | పద్దు | రు. కోట్లు |
|---|---|---|
| 1. | వ్యవసాయం, ఆహారధాన్యోత్పత్తి | 12.92 |
| 2 | నీటి పారుదల | 13.46 |
| 3. | విద్యుచ్ఛక్తి | 3.65 |
| 4. | పరిశ్రమలు | 2.70 |
| 5. | సాంఘిక సేవా సౌకర్యాలు | 8.76 |
| 6. | రహదార్లు | 1.87 |
| 7. | అవీ — యివీ | 0.68 |
| | మొత్తం | 44.04 |

ప్రణాళికా పథకాలకు 1959-60, 1960-61 సంవత్సరాల్లో ఉన్న ఆర్థిక వసతుల పరిస్థితి దిగువ ఉదహరించబడింది.

| | సవరించిన అంచనాలు 1959-60 రూ. కోట్లు | బడ్జెటు అంచనాలు 1960-61 రూ. కోట్లు |
|---|---|---|
| 1. ప్రారంభపు నిలవ | 6.95 | —4.89 |
| 2. రివిన్యూనుంచి వచ్చేది-అనగా సాధారణ ఖర్చులకై కేటాయించాక ఉండే రివిన్యూ మిగులు | 10.83 | 10.58 |
| 3. ప్రజలనుంచి ఋణాలు | 6.54 | 9.00 |
| 4. చిన్న మొత్తం పొదుపు (ఋణాలు) | 4.00 | 4.00 |
| 5. అమానంతాపతు పెట్టుబడి వసూళ్ళు (కేంద్ర ఋణాల చెల్లింపుకు కేటాయింపు చేశాక) | —13.43 | —7.67 |
| 6. పెట్టుబడి ఖాతా క్రింద రాష్ట్రపు వసతులు (3+4+5) | —2.89 | 5.33 |

| | | |
|---|---|---|
| 7. రాష్ట్ర పరిధిలోని మొత్తం వసతులు | 7.94 | 15.86 |
| 8. రాగలవనుకొన్న కేంద్ర గ్రాంట్లు | 5.27 | 5.00 |
| 9. లభించగలవనుకొన్న కేంద్రఋణాలు | 20.16 | 19.45 |
| 10. లభిస్తుందనుకొన్న మొత్తం కేంద్ర సహాయం (8+9) | 25.43 | 24.45 |
| 11. రివిన్యూ ఖాతాక్రింద లభించే మొత్తం వసతులు (2+8) | 16.10 | 15.58 |
| 12. పెట్టుబడి ఖాతాక్రింద లభించే మొత్తం వసతులు (6+9) | 17.27 | 24 78 |
| 13. మొత్తం లభించే వసతులు (11+12) | 33.37 | 40.31 |
| 14. రివిన్యూ ఖాతాక్రింద ప్రణాళిక వినియోగం | 14.15 | 15 83 |
| 15. పెట్టుబడి ఖాతాక్రింద ప్రణాళిక వినియోగం | 30.06 | 28.71 |
| 16. మొత్తం ప్రణాళిక వినియోగం (14+15) | 44.21 | 44.04 |
| 17. రివిన్యూ ఖాతాక్రింద మిగులు (11—14) | 1.95 | 0.20 |
| 18. పెట్టుబడి ఖాతాక్రింద మిగులు, లేదా తరుగు (12—15) | —12.79 | —3.93 |
| 19. మొత్తం మిగులు, లేదా తరుగు | —10 84 | —3.73 |
| 20. ముగింపు నిలవ (1—19) | —4.89 | —8.62 |

రెండవ పంచవర్ష ప్రణాళిక మొదటి నాలుగు సంవత్సరాల్లో వివిధ రంగాల్లో సాధించిన విజయాల గురించి *విడిగా ఒక నివేదికను అందజేస్తున్నాను.*

## మూడవ పంచవర్ష ప్రణాళిక

మన రాష్ట్రానికి మూడవ పంచవర్ష ప్రణాళికను రూపొందించే ఏర్పాట్లు చురుకుగా, తృప్తికరంగా సాగుతున్నాయి. పథకాలను తయారుచేయటానికి, వివిధరంగాల్లో లక్ష్యాలను నిర్దేశించటానికి, కార్యక్రమాల ముందు వెనుకలను నిర్ణయించటానికి, ప్రణాళికకు లభించే ఆర్థిక వసతులను అంచనా వేయటానికి

అవసరమైన ముఖ్య విషయాలను సేకరించే విషయంలో అప్పుడే కొంత చెప్పుకో తగ్గ పని జరిగింది. ప్రణాళికా సమితి చెప్పిన ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం పై విషయాల నిమిత్తం కొన్ని కార్యవర్గాలను ఏర్పరచింది. ఈ కార్యవర్గాల నివేదికలను ప్రణాళికకు సంబంధించిన రాష్ట్ర సలహా సంఘానికి సమర్పించటమైనది. చిత్తు ప్రణాళికలను, సమస్యలను మరింత తీవ్రంగా పరిశీలించటానికి, మూడవ ప్రణాళిక తయారీ విషయమై ప్రభుత్వానికి తగు సలహా నివ్వటానికి ఈ సంఘం తన సభ్యులతో క్రింది విధంగా నాలుగు ఉపసంఘాలను ఏర్పరచుకొన్నది.

(1) పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి గురించి ఉపసంఘం.

(2) వసతుల గురించి ఉపసంఘం.

(3) వ్యవసాయం, నీటి పారుదల గురించి ఉపసంఘం.

(4) సాంఘిక సేవా సౌకర్యాల గురించి ఉపసంఘం.

ముఖ్యంగా దిగువ చెప్పిన విషయాల గురించి తమ అభిప్రాయాన్ని ఇవ్వవలసిందిగా ఈ ఉపసంఘాలను కోరడమైనది:—

(అ) ఆయా ఉపసంఘాలకు సంబంధించిన ప్రతి అభివృద్ధి పద్దుకు పరిమితి.

(ఆ) ముందు వెనుకల అవసరంబట్టి ఏయే పథకాలను చేర్చాలి; వాటికి [అ] లో సూచించే పరిమితిలోంచి ఏయే కేటాయింపులు చేయాలి?

(ఇ) ఇంకెక్కువ ధనవసతి లభిస్తే, పరిశీలించవలసినవి ఏమైనా ఉంటే అట్టి పథకాలు.

ఈ ఉపసంఘాలు ఇప్పుడు పనిలో నిమగ్నమై వున్నాయి. తమ సిఫార్సులను త్వరలో పూర్తిచేసి, నివేదించవచ్చును. ఉపసంఘాల సిఫార్సుల ననుసరించి ఒక చిత్తు ప్రణాళిక తయారవుతుంది. దానిని రాష్ట్ర సలహాసంఘానికి పరిశీలనకై నివేదించటం జరుగుతుంది.

రాష్ట్ర మూడవ ప్రణాళిక నిర్మాణానికి వర్తించే ముఖ్య విషయం ఒకటి ఉన్నది. అది ఇది: రెండవ ప్రణాళిక సమయంలో ప్రారంభించిన పనులను పూర్తి చేయటానికి చాల డబ్బు కావాలి. వీటిని మామూలుగా "క్యారీఓవర్ పథకాలు" అని అంటారు. ఇవి వివిధ రంగాలకు చెందివుంటాయి. వీటికి గాను మూడవ

ప్రణాళిక సమయంలో సుమారు రు. 140 కోట్లు కావాలి. ఈ మొత్తం వివిధ రంగాలకు క్రింది విధంగా వర్తిస్తుంది.

రూ కోట్లలో

| అభివృద్ధి పద్దు | మూడవ ప్రణాళిలో ఉద్దేశించిన వినియోగం | కొరవలా ఖర్చు |
|---|---|---|
| 1 | 2 | 3 |
| 1. వ్యవసాయ కార్యక్రమాలు | 90.67 | 1.26 |
| 2. నీటి పారుదల, విద్యుచ్ఛక్తి · | | |
| (అ) నీటి పారుదల | 120 32 | 97.20 |
| (ఆ) విద్యుచ్ఛక్తి | 90.33 | 19 34 |
| 3. పరిశ్రమలు | 43.02 | 7.90 |
| 4. రవాణా | 25.67 | 5.90 |
| 5. సాంఘిక సేవా సౌకర్యాలు | 98.35 | 7.36 |
| 6. అవీ — యివీ | 6.52 | 0.80 |
| మొత్తం | 474.88 | 139.76 |

## ఎరువుల ఫాక్టరీ

మన ఎరువుల ఫాక్టరీ విషయంలో కొంత అభివృద్ధి జరిగిందని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం నియమించిన సాంకేతిక సంఘం గడచిన ఏప్రిల్ మాసములో మన రాష్ట్రానికి వచ్చి కొత్తగూడెంవద్ద ఒక ఎరువుల ఫాక్టరీని స్థాపించవలసిందిగా సిఫార్సు చేసింది. ఈ ఫాక్టరీకి ఏడాదికి 80,000 ల టన్నుల నత్రజనిని ఉత్పత్తిచేసే శక్తి ఉంటుంది. సింగరేణి బొగ్గుగనుల బొగ్గులను ఇందుకు గాను గ్యాసుగా మార్చాలి. ఈ సిఫార్సును అంగీకరించటానికి నిశ్చయించాము. ఫాక్టరీ నత్రజని ఎరువైన యూరియాను, కొంత మిశ్రమ ఎరువైన నైట్రో ఫాస్ఫేటును కొంత ఉత్పత్తి చేస్తుంది. మన భూములకు ఫాస్ఫరస్, నత్రజని రెండూ కొరతగానే ఉన్నాయి. కాబట్టి నైట్రోఫాస్ఫేటును ఉత్పత్తి చేస్తే, వ్యవసాయోత్పత్తి అధికమయ్యే అవకాశం ఉన్నది.

ఈ ప్రాజెక్టుకు పథకం వేసి, అమలు జరుపడంలో సహాయపడి, అండదండలుగా ఉంటామని కేంద్ర ప్రభుత్వం మనకు మాట ఇచ్చింది. తగిన దీర్ఘకాలిక

పెట్టుబడి రూపంలో అవసరమైనంత విదేశీమారక ద్రవ్యాన్ని సమకూరుస్తామని కూడా అన్నారు. ఈ విధంగా ఒక పెద్ద ఆటంకం తొలగిపోయింది. ఇక కావలసిన స్వదేశీ ధన సహాయంలో కొంత భాగం, భారతదేశ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ ఇచ్చే ఋణం ద్వారా లభించవచ్చును. ఈ సంస్థ మనకు సహాయపడటానికి అంగీకరించింది. మరి ప్రాజెక్టు పెట్టుబడి విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా పాల్గొనవలసిందని మనం అభిలషిస్తున్నాము. ఈ విధంగా వారిని కోరటమైనది

ఫాక్టరీ యంత్రస్థాపనకు, పరికరాలకు టెండరు ప్రమాణాలు తయారు చేయబడుతున్నాయి. కొలది నెలలలో, కాంట్రాక్టులను నిశ్చయించటానికి వీలవుతుంది. 1963 లో ఫాక్టరీ నిర్మాణం ముగిసి, పని ప్రారంభం కాగలదని ఆశిస్తున్నాము. ప్రాజెక్టు యాజమాన్యాన్ని, నిర్వహణను ఒక లిమిటెడ్ కంపెనీకి అప్పగించాలనుకుంటున్నాము. ఈ కంపెనీ త్వరలో "రిజిష్టరు" అవుతుంది. అయితే దీనిని ఒక విధంగా ప్రభుత్వ కంపెనీగానే భావించాలి. ప్రభుత్వ వాటాలు 51 శాతానికి తగ్గకుండా ఉంటాయి. కాని వ్యక్తుల స్వంత పెట్టుబడికి కూడా తగిన అవకాశం ఉంటుంది. పెట్టుబడిధనం కోసం మనం అభ్యర్థనను జారీ చేసినప్పుడు, రాష్ట్రం లోపల, బైటఉన్న వ్యవసాయదారులు, మిగతా పెట్టుబడిదార్లు ముందుకు వస్తారని నమ్ముతున్నాము.

## ప్రధాన కార్యాలయ భవనము

ప్రధాన కార్యాలయానికి చెందినట్టి ప్రభుత్వ ఆఫీసులు కొన్ని ప్రస్తుతం వ్యక్తుల స్వంత కట్టడాలలో పనిచేస్తున్నాయి. ఇందుమూలంగా ప్రభుత్వ వ్యవహారాలలో చాల జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ సిబ్బందికి, ప్రజలకు కూడా కొంత ఇబ్బందిగా ఉన్నది. అంతే కాదు, యీ కట్టడాల యజమానులకు అద్దెల క్రింద ఏటా సుమారు రు. 4 లక్షలు చెల్లించవలసివస్తోంది. ప్రస్తుత ప్రధాన కార్యాలయం చెడ్డ సమ్మర్దంగా ఉన్నది అయితే ఆంధ్రప్రదేశ్ అంతటి పెద్ద రాష్ట్రపు అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన భవనం కాదుకదా. కాబట్టి ప్రధాన కార్యాలయానికి క్రొత్త భవంతిని కట్టాలని సూచించటం జరిగింది. ఇప్పుడున్న తాత్కాలిక ప్రధాన కార్యాలయపు భవనాన్ని, నగరమంతటా చెల్లాచెదరుగా ఉంటున్న వివిధ ప్రభుత్వ శాఖలకు, ముఖ్యమైన ఇతర ఆఫీసులకు అప్పగించటం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు మొత్తానికి సుమారు రు. 1.00 కోటి అవుతుంది. క్రొత్త భవనానికి స్థలాన్ని నిర్ణయించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. సాధ్యమైనంత త్వరలో పనిని ప్రారంభించేందుకు గాను, 1960—61 ప్రణాళిక అంచనాల్లో రు. 20.00 లక్షలు కేటాయించబడినాయి.

## బొంబాయిలోని ఆస్తి అమ్మకం

బొంబాయిలోని నేపియన్ సముద్రపు రోడ్డు సమీపంలో నున్న పూర్వ హైదరాబాదు రాష్ట్రపు ఆస్తిని కేంద్ర ప్రభుత్వానికి అమ్మినందువలన, రు. 72.00 లక్షలు వచ్చింది. ఈ అమ్మకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగింది. రాష్ట్రాల పునర్నిర్మాణ చట్టం ప్రకారం ఈ అమ్మకపు ధనాన్ని పూర్వ హైదరాబాదు రాష్ట్రంస్థానే ఇప్పుడున్న మూడు వారస రాష్ట్రాలకు పంపకం చేయాలి. మన వాటా సుమారు రు. 40.00 లక్షలు ఉంటుంది. క్రొత్త ఢిల్లీలోని భవనాన్ని కూడా విక్రయం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

## బ్యాంకింగ్ వసతుల విస్తరణ

ఇటీవల సంవత్సరాల్లో బ్యాంకింగ్ వసతులు వృద్ధిచెందాయి. అయినప్పటికి ఇవన్నీ చాలావరకు నగరాలకే పరిమితమై వున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు కూడా వీటిని తగినంతగా విస్తరించటానికి కొంతకాలం పట్టుతుంది. చాల బ్యాంకులు ప్రారంభించిన విస్తరణ కార్యక్రమాల ఫలితంగా పరిస్థితి కొంత అభివృద్ధి చెందింది. ముఖ్యంగా భారత దేశపు స్టేట్ బ్యాంకు చాలా కృషిచేసింది. 1955 లో పూర్వపు భారతదేశ ఇంపీరియల్ బ్యాంకును స్టేటు బ్యాంకుగా రూపొందించటం జరిగింది. ఈ సంస్థ అయిదేళ్ళలో దేశమంతటా అదనంగా 400 కేంద్రాలను ఏర్పాటు చేయవలసివున్నది. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకు, స్టేటు బ్యాంకు గడచిన అయిదేళ్ళలో 32 కేంద్రాలను ప్రారంభించింది. మరొక మూడు కేంద్రాలను త్వరలో ఆంధ్రప్రాంతంలో ఆరంభిస్తుంది. తెలంగాణా ప్రాంతానికి ఎక్కువగా హైదరాబాదు స్టేటు బ్యాంకు ఉపయోగపడుతోంది. దీనిని ఇటీవల భారతదేశపు స్టేటు బ్యాంకుకు అనుబంధసంస్థగా ఏర్పాటు చేయటం జరిగింది. పూర్వపు బ్యాంకు కూడా విస్తరణ కార్యక్రమానికి పూనుకొన్నది. ప్రస్తుత సంవత్సరంలో వికారాబాదులో, మహబూబ్‌నగర్ లో కేంద్రాలను ప్రారంభించింది. ఏడాదికాలంలో మరొక అయిదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉద్దేశించింది. తెలంగాణా జిల్లాలకు చాలా కాలంనుంచి వుంటున్న అవసరాలు ఈ కేంద్రాలవలన తీరవచ్చును.

## విద్యుచ్ఛక్తి సంస్థ

1-4-1959 నాటినుంచి ఆంధ్రప్రదేశ్ స్టేటు విద్యుచ్ఛక్తి సంస్థ పనిచేస్తూంది. విద్యుచ్ఛక్తి పంపకానికి, సప్లయికి సంబంధించిన పనుల నిర్మాణానికి, నిర్వహణకు ఈ సంస్థ బాధ్యత వహిస్తుంది. ప్రధాన ఉత్పాదక కేంద్రాలకు చెంది

నట్టి డీసెల్ కేంద్రాల నిర్మాణ నిర్వహణల బాధ్యత కూడ ఈ సంస్థదే. ఈ సంస్థ అధ్యయనం చేస్తుంది విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల పరిశోధన, నిర్మాణం, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి ముఖ్య పంపకం ప్రభుత్వ బాధ్యతకే చెందివుంటాయి. ఈ సంస్థ కార్యాలయపు సిబ్బంది మినహా మొత్తం సిబ్బంది అంతా ప్రభుత్వం క్రిందే వుంటూ వుంటుంది. వాళ్లు ప్రభుత్వానికి పనిచేస్తూ వుండవచ్చును. ఆ సంస్థకూ పనిచేస్తూ వుండవచ్చును. లేదా రెంటికిందా పనిచేస్తూ వుండవచ్చును. సిబ్బందికయ్యే ఖర్చుకు ఈ సంస్థ పేరుకు మాత్రం బాధ్యత వహిస్తుంది.

ప్రభుత్వం ఒక రాష్ట్రీ విద్యుచ్ఛక్తి సలహాసంఘాన్ని కూడ ఏర్పాటుచేసింది క్రియా విధానాలకు సంబంధించిన ముఖ్య విషయాలను గురించి, పెద్ద స్కీములను గురించి, పై సంస్థకు సలహానివ్వటానికి, దాని పనిపోటులను, అభివృద్ధిని మధ్యమధ్య సమీక్షించటానికి, పై సంస్థగాని, రాష్ట్రీ ప్రభుత్వముగాని ప్రస్తావించే ఇతర విషయాలను పరిశీలించి, సలహానివ్వటానికి ఈ సంఘం బాధ్యత వహిస్తుంది. ఈ సంఘంలోని సభ్యులు వివిధ విషయాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి సప్లయి పరిశ్రమ, వాణిజ్యం, పరిశ్రమ, రవాణా, వ్యవసాయం, కార్మికశాఖ, వినియోగదార్లు.

విద్యుచ్ఛక్తి సంస్థకు కావలసిన మొత్తం పెట్టుబడిని రాష్ట్రీ ప్రభుత్వం సమకూరుస్తుంది. ఏర్పడిననాటినుంచి, ఈ సంస్థ రు. 5.97 కోట్లు ఖర్చు అయ్యే 164 విస్తరణ స్కీములను మంజూరుచేసింది. ఈ స్కీముల్లో గ్రామీణ విద్యుచ్ఛక్తికి సంబంధించినవి కూడా ఉన్నాయి. సంవత్సరాంతానికి సుమారు 400 గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సప్లయి చేయాలని వున్నది. ఈ సంస్థ ఆదాయ వ్యయాలను గురించి క్రింది అంకెలద్వారా కొంత తెలుసుకోనవచ్చును.

(రూ. కోట్లు)

| | 1959–60 | 1960–61 |
|---|---|---|
| మొత్తం సంపాదన | 5.52 | 6.37 |
| నిర్వహణ మరియు వడ్డీ ఖర్చులు | 7.33 | 8.14 |
| నికర సంపాదన | (—)1.81 | (—)1.77 |

## రోడ్డు రవాణా సంస్థ

ఈ సంస్థ, కృష్ణాజిల్లాలోని మోటారు రవాణాను జాతీయంచేసే కార్యక్రమాన్ని పూర్తి చేసివుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 230 బస్సులను నడుపుతోంది. 1960–61 కార్యక్రమం ప్రకారం, 1960 ఏప్రిల్ నెలనుంచి ఈ వసతులను

పశ్చిమ గోదావరి జిల్లాలోనూ, 1960 డిసెంబరు నుంచి గుంటూరు జిల్లాలోనూ విస్తరించాలని వున్నది. ఈ విధంగా 1961 మార్చి నెలాఖరుకు ఈ రెండు జిల్లాల్లోనూ బస్సు రవాణా జాతీయం చేయటం పూర్తి అవుతుంది. ఇందు నిమిత్తం, వచ్చే పడాది 300 కొత్త బస్సులు కావాలి. తెలంగాణాలోని పాతవాటిస్థానే కొత్తవి మరొక నూరు కావాలి. 1960–61 సంవత్సరానికి ఈ సంస్థ వేసుకొన్న పెట్టుబడి కార్యక్రమం క్రింద పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాల్లో గ్యారేజీలు, కట్టడాలు కూడ నిర్మించబడుతాయి. 1960–61వ సంవత్సరానికి ఈ సంస్థ పెట్టుబడి ఖర్చు రు. 185 లక్షలు ఉంటుందని అంచనా వేయబడింది. వచ్చే పడాదికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థ పెట్టుబడికి ఏమీ ధనం ఇవ్వటంలేదు. ఎందుకంటె రెండవ ప్రణాళికలో కేటాయించిన మొత్తం యావత్తూ ఈ సంస్థకు పెట్టుబడిగా పెట్టటం అయింది. కాబట్టి పెట్టుబడి ఖర్చుకు డబ్బు చూసుకోవటంలో సంస్థ కొంత వరకు తన స్వంత వనరులపైన, కొంతవరకు ఋప్పులపైన ఆధారపడవలసి వస్తుంది. 1959–60, 1960–61 సంవత్సరాలకు సంస్థ మొత్తం సంపాదన వరుసగా రు. 362 లక్షలు, రు. 476 లక్షలు అని అంచనా వేయబడింది నిర్వహణ ఖర్చులు యీ పడాది రు. 285 లక్షలు, వచ్చే పడాది రు. 365 లక్షలు ఉండవచ్చును. అంటే నికర సంపాదన రు. 77 లక్షలనుంచి రు. 111 లక్షలకు పెరుగుతుందన్నమాట.

## పారిశ్రామిక ఆర్థిక సంస్థ

పూర్వపు ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్రాల్లోని ఆర్థిక సంస్థలను జతపరచి, 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక సంస్థను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సంస్థ తన పరిమిత పరిధిలో ప్రయోజనకరంగానే పనిచేస్తోంది. 1959–60 సంవత్సరానికి ఈ సంస్థ అంచనాలు—మొత్తం ఆదాయం రు. 7.75 లక్షలు; నిర్వహణ ఖర్చులు, పన్నులు, నిలవ నిధులు వగైరాల కేటాయింపు తర్వాత వచ్చే నికర ఆదాయం రు. 2.75 లక్షలు. పూచీపడిన కనీసపు డివిడెండును చెల్లించటానికి ఇది సరిపోదు కాబట్టి, ప్రభుత్వం ఈ సంస్థకు సుమారు రు. 2.50 లక్షల వరకు విరాళమిచ్చి సహాయపడవలసి వస్తుంది.

ఈ సంస్థపని నానాటికి హెచ్చుతోంది. ప్రస్తుత సంవత్సరంలో ఈ సంస్థ 27 యూనిట్లకు సుమారు రు. 30 లక్షల వరకూ ఋణాలను మంజూరుచేసింది.

## పారిశ్రామిక అభివృద్ధి సంస్థ

రాష్ట్రంలోని పారిశ్రామిక అభివృద్ధికి ఊతం ఇచ్చేందుకుగాను, ప్రభుత్వం మొదట ఒక కోటి రూపాయిల పెట్టుబడితో ఒక పారిశ్రామిక అభివృద్ధి సంస్థను

ప్రారంభించ నిశ్చయించింది. ఈ పెట్టుబడి అవసరమును బట్టి తరువాత మూడు కోట్ల రూపాయలవరకు పెంచవచ్చును. ఇది భారతదేశ కంపెనీల చట్టం క్రింద రిజిష్టరు చేయబడుతుంది. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి విషయంలో శ్రద్ధవున్న ముఖ్యులు, కొంతమంది పౌరులు కూడా డైరెక్టర్ల బోర్డులో సభ్యులుగా ఉంటారు. స్వంతంగాగాని లేదా వ్యక్తుల యాజమాన్యంలోగాని కలసి ఈ సంస్థ పరిశ్రమలకు పథకాలు వేసి, పెంపొందించి ఏర్పాటుచేస్తుంది. అట్టి సంస్థను నెల కొల్పటం మూలంగా పెట్టుబడిదార్లకు నమ్మకం హెచ్చుతుందని, ప్రైవేటు రంగంలో కూడ పరిశ్రమలు ఇంకెక్కువగా అభివృద్ధిచెందుతాయని ప్రభుత్వం ఆశిస్తూంది.

## ముగింపు

గడచిన మూడేళ్ళలో జరిగిన పనిని గురించి, 1960—61 లో చేయదలచు కొన్న కృషిని గురించి, మొత్తం రాష్ట్రపు ఆర్థిక పరిస్థితికి సంబంధించినంతవరకూ, ముఖ్యంగా ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులకు సంబంధించినంతవరకూ వివరించాను. చేసిన కృషి ప్రజల అవసరాలకు, ఆశయాలకు తగినంతగా లేదని; నిజంగా శ్రేయో రాజ్యాన్ని స్థాపించామని చెప్పుకోవాలంటె ఇంకా మనం చాలా దూరం పురోగ మించవలసి వున్నదని నేను ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఏమయినా, మనం వెళ్తున్నదారి మాత్రం సరైనది. మన గమ్యాన్ని కూడా త్వరలోనే చేరగలుగు తాము. రానున్న సంవత్సరాల్లో దీనికై మన శక్తిసామర్థ్యాలను, వసతులను పూర్తిగా వినియోగించవలసివస్తుంది.

ఈ బడ్జెటు రు. 8.62 కోట్ల లోటు నిలవతో ముగుస్తుంది. ఖర్చు కార్య క్రమాన్ని తగ్గించేవుంటే, దీనిని నివారించుకొనగలిగేవాళ్ళమే. అయినా, ఏది ఏమైనప్పటికి ప్రణాళికా లక్ష్యాలను మాత్రం సాధించి తీరాలనే పట్టుదలతో వున్నాము. ఇదే మనకు తగినంత ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని చేకూర్చగలుగు తుంది. తత్ఫలితంగా మూడవ ప్రణాళిక సందర్భంలో ఉత్పన్నమయ్యే అవస రాలను, బాధ్యతలను ధైర్యంతో ఎదుర్కొనగలుగుతాం.

దీనికి తగిన రీతిగా, పరిపాలనావ్యవస్థను కూడా పటిష్టం చేస్తున్నాము. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పబ్లిక్ వర్క్సులాంటి కొన్ని పెద్ద ప్రభుత్వ శాఖలకై ఆర్థిక సలహాదారులను ఏర్పాటుచేసే విధానాన్ని ఆర్థిక శాఖలో ఇటీవల ప్రవేశ పెట్టాము. ఇందుమూలంగా ఈ శాఖల పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలిసింది. ఆయా శాఖల ఆర్థిక వ్యవహారాలపై దీనివల్ల ఇంకెక్కువ పటిష్ఠమైన అజమాయిషీ కూడా ఏర్పడుతుంది.

ప్రసంగాన్ని ముగించేముందు, వ్యవసాయరంగానికి పరిశ్రమలకు సహాయాన్ని సమకూర్చే కొన్ని కార్యక్రమాల గురించి ప్రకటిస్తాను వివరాలు —

(1) వచ్చే 3 సంవత్సరాలకు వేరుశెనగకు సంబంధించిన ప్రత్యేక విధింపు నిలుపుదల; (హర్షం)

(2) వచ్చే 3 సంవత్సరాలకు ప్రత్తికి సంబంధించిన ప్రత్యేక విధింపు నిలుపుదల, (హర్షం)

(3) చేనేత పరిశ్రమ వినియోగించిన ప్రత్తి, నూలు అమ్మకాల పన్ను మినహాయింపు; (హర్షం)

(4) తమ ఘానీల ఉత్పత్తి అమ్మకాలపై పన్ను మినహాయింపుకు అర్హత కనుక వుండివుంటే, ఘానీలు స్వంతంగా ఉన్నవారు కొనే నూనెవిత్తుల కొనుగోలుకు పన్ను మినహాయింపు,

(5) నూనెపిండి అమ్మకాలపై పన్ను రేటును 3 శతినుంచి 2 శతికి తగ్గించటం.

